క్లుప్తంగా

చదరంగం పోటీలకు విశేష స్పందన



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మాకవరపాలెం: గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం నిర్వహించిన చదరంగం పోటీలకు విశేష స్పందన లభించింది. స్థానిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. విజేతలకు ఉగాది నాడు బహుమతులు అందజేస్తామని నిర్వాహకుడు పి.రంగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌతమి లలిత కళా శిక్షణ కేంద్రం కార్యదర్శి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు అక్కమ్మ పేరంటాల తీర్థం

మాడుగుల రూరల్: తాటిపర్తి పంచాయతీ శివారు కాశీపురంలో అక్కమ్మ పేరంటాలు తీర్థాన్ని శనివారం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన జరపనున్నట్టు చెప్పారు.

వడ్డాది వెంకన్న పెళ్లిరాట నేడు

బుచ్చెయ్యపేట: ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధి చెందిన వడ్డాది వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలకు శనివారం పెళ్లిరాట వేస్తున్నట్టు ఆలయ వంశపారం పర్య ధర్మకర్త దొండా కన్నబాబు,ఆలయ ఈవో శర్మ తెలిపారు. ఇక్కడ ఐదు రోజుల పాటు కల్యాణ మహోత్సవాలు కమనీయంగా జరుగుతాయి. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాక ఇతర రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు.

సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం జంక్షన్‌లో గల సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, గోమాతకు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన జరిపారు.

24న తీర్థం

ఈ నెల 24న సంతోషిమాత తీర్థం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు కాళ్ల అమ్మతల్లినాయుడు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

మాడుగుల రూరల్: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫామింగ్ మండల యాంకర్ గండి శ్రీనివాసరావు తెలిపారు. కె.జె.పురం - మాడుగుల మధ్య కళ్లాల్లో శుక్రవారం ప్రకృతి వ్యవసాయం, కషాయాల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ముకుందపురంలో వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రాము, చిన్నంనాయుడు, పార్వతి, అబి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా నరేంద్ర బాధ్యతల స్వీకరణ



రోలుగుంట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న నరేంద్ర రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి పొందారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రీసర్వే పనులు త్వరితగతిన జరిగేలా కృషి చేస్తానని చెప్పారు.

రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం కార్యవర్గ సభ్యుడిగా అప్పారావు



మాడుగుల రూరల్: రాష్ట్ర వీఆర్‌ఏల సంఘం కార్యవర్గ సభ్యుడిగా వి.మాడుగుల మండలం వంటర్లపాలెం వీఆర్‌ఏ దోని చిన అప్పారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక గురువారం తాడేపల్లిలో నిర్వహించారు. గతంలో అప్పారావు వీఆర్‌ఏల సంఘం ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. వీఆర్‌ఏలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని అప్పారావు తెలిపారు.

ఓం శివోహం.. రుద్ర నామం భజేహం

మహా శివరాత్రికి శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. ఆలయ కమిటీలు పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేశాయి. ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు

- శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం
- ఆలయాల వద్ద పూర్తిస్థాయిలో ఏర్పాట్లు



వడ్డాదిలో భ్రమరాంబిక సహిత మల్లికార్జున స్వామి ఆలయంలో శివపార్వతుల విగ్రహాలు

మాకవరపాలెం: వామలింగేశ్వరస్వామి ఆలయం శివరాత్రి పూజలకు సిద్ధమైంది. మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో పెద్దమిల్లు జంక్షన్ వద్ద ఈ ఆలయం ఉంది. వామనుడి చేత పూజలందుకోవడంతో వామలింగేశ్వరుడిగా పేరొచ్చిందని పూర్వీకులు తెలిపారు. శివరాత్రి సందర్భంగా ఆలయంలో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. గిడుతూరులోని గంగాధరేశ్వరస్వామి, పి.పి.అగ్రహారంలోని అమృతేశ్వరస్వామి ఆలయాల్లో కూడా ప్రత్యేక పూజలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.



వామలింగేశ్వర ఆలయంలో స్వయంభూ లింగం

నేటి నుంచి ఉత్సవాలు

మాడుగుల: స్థానిక పురాతన శైవక్షేత్రం ఉబ్బలింగేశ్వర ఆలయంతో పాటు కృష్ణభూపాలేశ్వర, భీమలింగేశ్వర, ఉమాభీమలింగేశ్వర, గుప్తలింగేశ్వర ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు శనివారం మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద విద్యుత్ దీపాలంకరణ, ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

మాడుగుల రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా అత్యంత పురాతన శివాలయమైన ఎం.కోడూరు కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో శనివారం శివపార్వతులు కల్యాణం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు చింతా వెంకటరమణమూర్తి తెలిపారు. వి.వి. అగ్రహారం, జంపెన, పిట్టగెడ్డ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు.

కె.కోటపాడులో

కె.కోటపాడు: మహా శివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. కె.కోటపాడులోని భీమలింగేశ్వరాలయంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లును ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఉప సర్పంచ్ రెడ్డి అరుణ చేశారు. చౌడువాడలోని కాశీవిశ్వేశ్వరాలయం, ఎ.కోడూరులో గల భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి, లంకవానిపాలెంలో గృహలింగేశ్వరాలయాల్లో పూజల నిర్వహణకు ఆలయ కమిటీలు ఏర్పాట్లు చేశాయి.



వామలింగేశ్వర ఆలయం

బుచ్చెయ్యపేట మండలంలో..

బుచ్చెయ్యపేట: మహాశివరాత్రి ఉత్సవాలకు మండలంలోని పలు గ్రామాల్లో శివాలయాలు ముస్తాబయ్యాయి. బుచ్చెయ్యపేట,మేజర్ పంచాయతీ వడ్డాది, రాజాం, సీతయ్యపేట, విజయరామరాజుపేట, ఫంగిడి, దిబ్బిడి, గంటికొర్లాం,నిమ్మలోవ, బంగారుమెట్ట తదితర గ్రామాల్లో ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

వడ్డాది కొత్తూరు సింహాబలుడు కొండపై వెలిసిన పద్మలింగేశ్వరస్వామి కల్యాణ వేడుకల వాల్‌పోస్టర్‌ను జెడ్పీటీసీ దొండా రాంబాబు,ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం విడుదల చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. వడ్డాది బజారువీధి వద్ద ఉన్న భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయం,దిబ్బిడి శివాలయాల్లో రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.



వడ్డాదిలో పద్మలింగేశ్వరస్వామి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న జెడ్పీటీసీ రాంబాబు



కె.కోటపాడులోని భీమలింగేశ్వరాలయం



జంపెన శివాలయం

వైభవంగా ఉమామహేశ్వర కల్యాణం

దేవరాపల్లి: మండలంలోని తిమిరాం శివాలయంలో ఉమామహేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ పురోహితుడు పాకల కామేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కల్యాణం జరిపారు.తిమిరాంతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు పాల్గొన్నారు. ఆలయ పరిసరాలు శివనామ స్మరణంతో మార్మోగాయి.



ఉమామహేశ్వర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు



వంటర్లపాలెంలో శివపార్వతులు

పశువుల్లో గర్భకోశ వ్యాధిపై అవగాహన అవసరం



జైతవరంలో గర్భకోశ వ్యాధికి చికిత్స అందిస్తున్న చేస్తున్న సిబ్బంది

చీడికాడ: పశువుల్లో సంక్రమించే గర్భకోశ వ్యాధి పై రైతులు అవగాహన కలిగిఉండాలని స్థానిక పశువైద్యాధికారి జి.గాయత్రీ దేవి అన్నారు. మండలంలోని జైతవరంలో గర్భకోశ వ్యాధి నివారణ వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధిపై ప్రతి సచివాలయం పరిధిలో అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. గొర్రెలు,మేకలకు పీపీఆర్ టీకాలు వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైతవరం సర్పంచ్ కోడూరి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలని వినతి

కె.కోటపాడు : పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలను వెంటనే మంజూరు చేయాలని ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు కోరారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు కె.కోటపాడులో శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానం రద్దుపై జాప్యం తగదన్నారు. 12వ వేతన సంఘాన్ని నియమించడంతో పాటు 3,4,5 తరగతుల విలీన ప్రక్రియను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రాన్ని రెవెన్యూ అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆదిరెడ్డి అబద్ధం, వెంకునాయుడు, శ్యామలం, చింతు రాజు, సూర్రెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి రమేష్

మాకవరపాలెం: జగనన్న లేఅవుట్లలో గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి సీహెచ్.రమేష్ సూచించారు. మండలంలోని రామన్నపాలెం, రాచపల్లి జగనన్న కాలనీలను ఆయన శుక్రవారం పరిశీలించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడుతూ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. బిల్లులు సకాలంలో అందిస్తున్నట్టు చెప్పారు. ఉగాది నాటికి మండలంలో 420 మంది గృహ ప్రవేశాలు చేయనున్నట్టు చెప్పారు. ఆయన వెంట ఎంపీడీవో అరుణశ్రీ , హౌసింగ్ జేఈ రామలింగస్వామి, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

ఎన్నికల కోడ్ పక్కాగా అమలు



మాట్లాడుతున్న ఎస్ఐ

నాతవరం: ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ ఎన్నికలు పూర్తయ్యే వరకు ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేస్తామని స్థానిక ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండా ఎక్కడా ప్రచారాలు, వాల్ పోస్టర్లు, జెండాలు ఏర్పాటు చేయరాదన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకుండా తగిన చర్యలు చేపట్టినట్టు చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ర్యాలీ



మాట్లాడుతున్న ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్

నర్సీపట్నం: రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఏఎస్పీ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై టౌన్ పోలీసులు విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్టు ధరించక పోవడం వల్లే రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ అత్యంత ప్రమాదకరమన్నారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆర్డీవో కార్యాలయం మీదుగా పోలీసు స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో సీఐలు ఎస్.గణేష్, రమణయ్య, ఎస్ఐలు గోవిందరావు, ధనుంజయ నాయుడు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉగాది నాటికి శతశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తి



ఎం. బెన్నవరంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు

నాతవరం: ఉగాది నాటికి జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు శతశాతం పూర్తి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలోని నాతవరం ఎం.బెన్నవరం గ్రామాల్లో జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలను హౌసింగ్ జేఈ జోగారావుతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతవరకు మండలంలో 400 పైగా ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. మరో 1200 పైగా నిర్మాణాల వివిధ దశల్లో ఉన్నాయన్నారు.

ఘనంగా అడవి రాజులబాబు పండగ



నాతవరంలో అడవిరాజులబాబును దర్శించుకుంటున్న భక్తులు

నాతవరం: మండలంలోని పలు గ్రామాల్లో అడవి రాజులబాబు పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కొత్త రామచంద్రాపురం, నాతవరం, చమ్మచింత, వెన్నలపాలెం గ్రామాల్లో ఉత్సాహంగా జరుపుకొన్నారు. రాజులబాబులను దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. నాతవరం శెట్టి వారి వనంలో గల అడవిరాజులబాబుల ఆలయం వద్ద భక్తులు పూజలు చేసి, అనంతరం అక్కడే సంహపంక్తి భోజనాలు చేశారు. మహిళలు కోలాటాలు నిర్వహించారు.

సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యం

- ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



ఎమ్మెల్సీ ఎన్నికల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్



జేడీపేటలో ప్రచారంలో పాల్గొన్న రాజారామ్ తదితరులు

నర్సీపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్ గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నాయకులకు సూచించారు. క్యాంపు కార్యాలయంలో ఎన్నికల పోస్టర్‌ను పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుధాకర్ విజయానికి పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గొంప కన్నయ్యనాయుడు, సర్పంచ్ శానపతి వెంకటరత్నం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్ల సత్యనారాయణ, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, గొలుగొండ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు తాతబాబు, ఇన్నం రమణ తదితరులు పాల్గొన్నారు.

జేడీపేటలో..

మాడుగుల: వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తాళ్లపు రెడ్డి వెంకటరాజారామ్ తదితరులు మండలంలోని జేడీపేటలో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రాజారామ్ మాట్లాడుతూ సుధాకర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల మండల కన్వీనర్లు పర్రే ఏసుబాబు, నున్నగొప్పుల శ్రీనివాసరావు, నల్లబొడ్డి శ్రీనువాసరావు తదితరులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ..

మాడుగుల రూరల్: ఎమ్మెల్సీ అభ్యర్థులకు మద్దతుగా పలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా ఆ పార్టీ నాయకులు కేజే పురం, ముకుందపురాలలో శుక్రవారం ప్రచారం చేశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు కర్రి గణేష్, అల్లాడ నాగేశ్వరావు, ఎంపీటీసీ సభ్యురాలు దండి నాగరత్నం, నాయకులు ప్రచారం చేశారు. మాధవ్‌కు మద్దతుగా బీజేపీ నాయకులు కె.జె.పురం, వంటర్లపాలెం, ముకుందపురం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు పుట్టా రాంబాబు, మండల మాజీ అధ్యక్షుడు సాలాపు వీరునాయుడు, పెంటకోట జగదీష్ పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీ మద్దతు ఇస్తున్న అభ్యర్థి చిరంజీవిరావును గెలిపించాలని ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు తదితరులు పొంగలిపాక, కింతలి తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు.

ఆకస్మికంగా వసతి గృహాల్లో తనిఖీలు



వంటకాలను పరిశీలిస్తున్న ఆర్డీవో జయరాం, కమిషనర్ కనకారావు



విద్యార్థినుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఆర్డీవో జయరాం



రోలుగుంట బీసీ బాలుర వసతి గృహంలో రికార్డులు పరిశీలిస్తున్న ప్రసాదరావు



తెనుగుపూడి గురుకుల విద్యాలయంలో తనిఖీలు చేస్తున్న రవీంద్రనాథ్, ఎంపీడీవో సుబ్బలక్ష్మి

నర్సీపట్నం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆర్డీవో హెచ్.వి.జయరాం, మున్సిపల్ కమిషనర్ కె.కనకారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇంటర్‌విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాన్ని ఆర్డీవో పరీక్షించారు. విద్యార్థులు చదువులో మరింత చురుగ్గా ఉండే విధంగా ఉపాధ్యాయులు బోధించేలా బాధ్యత తీసుకోవాలని ప్రిన్సిపాల్ సునీతకు సూచించారు. విద్యార్థుల సందేహాలను ఆర్డీవో నివృత్తి చేశారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనాన్ని పరిశీలించారు. కళాశాలలో ఉన్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఎస్సీ బాలుర వసతిగృహాన్ని పరిశీలించారు. మరుగుదొడ్లు శుభ్రత లోపించడం, హాస్టల్ భవనం అసౌకర్యంగా ఉండటాన్ని ఆర్డీవో, కమిషనర్ పరిశీలించారు. సిబ్బంది బాధ్యరాహిత్యంగా ఉంటాన్ని గమనించారు. తాము గుర్తించిన లోపాలను కలెక్టర్‌కు నివేదిస్తామని ఆర్డీవో తెలిపారు.

దేవరాపల్లి మండలంలో...

దేవరాపల్లి: మండలంలోని పలు వసతి గృహాలను మండల స్థాయి అధికారులు శుక్రవారం సందర్శించారు. తెనుగుపూడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంతో పాటు బేతపూడి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, దేవరాపల్లి బీసీ బాలుర వసతి గృహాన్ని మండల ప్రత్యేక అధికారి వి.రవీంద్రనాథ్, ఎంపీడీవో సీహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ కె.ఉషశ్రీ సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. వసతి గృహాల్లో భోజనం నాణ్యతను, స్టాక్ రూమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు.

రోలుగుంటలో..

రోలుగుంట: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో మరమ్మతు పనులు జరిపేందుకు కలెక్టర్ నివేదిక అందజేస్తానని మండల ప్రత్యేక అధికారి బి.ప్రసాదరావు తెలిపారు. స్థానిక బీసీ బాలుర వసతి గృహాన్ని ఆయన ఎంపీడీవోతో కలసి శుక్రవారం సందర్శించారు. రికార్డుల నిర్వహణకు సంబంధించి వార్డెన్ హరిగోపాల్‌కు పలు సూచనలను చేశారు. పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక క్లాసులు నిర్వహించాలన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వసతి గృహంలో పాడైన చోట్ల మరమ్మతులు చేయించేందుకు కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని తెలిపారు.

నాతవరం మండలంలో

నాతవరం: మండలంలో అన్ని వసతి గృహాలను పరిశీలించినట్టు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. రామన్నపాలెం, తాండవలలోని గిరిజన ఆశ్రమ వసతి గృహాలు , చమ్మచింత, నాతవరంలలో గల హాస్టళ్లను శుక్రవారం పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు హాస్టళ్లను తనిఖీ చేసినట్టు చెప్పారు. హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలపై కలెక్టర్‌కు నివేదిక అందజేస్తామని చెప్పారు.



రామన్నపాలెం హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఉగాది నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి



గృహనిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

రోలుగుంట: జగనన్న లేఅవుట్లలో ఉగాది నాటి కల్లా గృహ నిర్మాణాలు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయాలని మండల ప్రత్యేకాధికారి బి.ప్రసాదరావు సూచించారు. శుక్రవారం స్థానిక హౌసింగ్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన, హౌసింగ్ ఏఈ ప్రేమానందంతో కలిసి మండలంలో పలు గ్రామాల్లో జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. రోలుగుంట-2లో గృహనిర్మాణాలను పరిశీలించి, ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవో ప్రభాకర్రావు, ఏఈ ప్రేమానందం, ఏపీవో సూర్యామణిలతో చర్చించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండు పోలింగ్ కేంద్రాలు

నాతవరం: ఎమ్మెల్సీ ఎన్నికలకు మండలంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ పి.కనకారావు తెలిపారు. ఆయన తన కార్యాలయంలో శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించి, ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 1,588 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. వారంతా ఓటు వేసేందుకు మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 177, 178 నంబర్లతో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో జగనన్న రీసర్వే వేగవంతంగా చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, సీనియర్ అసిస్టెంటు డి.కృష్ణ, ఆర్ఐ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోకు అభినందనలు

నర్సీపట్నం: డీఈవోగా బాధ్యతలు చేపట్టిన ఎం.వెంకటలక్ష్మిని సీఆర్పీ హక్కుల సాధన సమితి నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. డీఈవోను కలిసిన వారి లో పూడి వెంకటరావు, అచ్యుతకృష్ణ,శంకర్, లక్ష్మణ్, నీలవేణి ఉన్నారు.